

## గురుశిష్యులు

పూర్వం పరమానందయ్యగారి తరువాత అటువంటి గురువుగారికి ఒక శిష్యుడు ఉండేవాడు. అతడు ప్రపంచ జ్ఞానంలేని అమాయకుడై గురువుగారివెంట ఆయన చెప్పినట్లల్లా తిరిగి నడిచేవాడు.

గురువుగారికి ఒకామెతో సంబంధం ఉండేది. ఒకనాడు ఆమె గురువుగారి కౌగిట్లో ఉండగా శిష్యుడి నేత్రాలు పడింది. అతడికి ఏమీ బోధపడలేదు కాని శరీరమంతా పులకరింతవంటిది వచ్చి వింతగా తోచింది. తరువాత గురువుగారివద్ద అతడు తన సందేహం వెలిబుచ్చేడు. దానికి "అబ్బే మరేం లేదు, ఆమెకు కొంచెం కాళ్ళ పీకుగా ఉందట. దానికి మందు వేస్తున్నా" అన్నాడు. కాబోలనుకున్నాడు శిష్యుడు.

కొంతకాలం తరువాత పొరుగు పల్లెటూరువెళ్లి తోడుగ ఉండి తనభార్యను తీసుకరమ్మని పంపాడు శిష్యుణ్ణి. ఆ కాలంలో పల్లెలనుండి రావలెనంటే బళ్ల మీద లేకుంటే నడిచి రావలసివచ్చేది. శిష్యుడు ఆమెని తాపిగా నడిపించి తీసుకవస్తూ వుంటే ఆమె నడవలేక "నే నింక నడవలేను బాబూ. కాళ్ళు పీకుతున్నాయి. కాస్సేపు విశ్రమించి మళ్లా బయల్దేరుదామంది." అప్పుడు శిష్యులు "మరేం ఫరవాలేదు. నాకు మందు తెలుసు. గురువుగారు పొరుగింటి సుబ్బమ్మగారికి కాళ్లపీకు వచ్చినప్పుడల్లా ఇట్లాగే చేసేవారు" అని ఆమెను దగ్గరగా తీసుకుని ముద్దుపెట్టుకున్నాడు. ఆమె విదిలించుకోబోయింది కాని తాను లేనప్పుడు పొరుగింటామెతో భర్త కులుకుతున్నాడని తెలియగానే ఆమె అతన్ని గట్టిగా దగ్గరకు తీసుకుని ముద్దుపెట్టుకుంది. కొంతసేపైనాక వాళ్లు మరల ప్రయాణం సాగించేరు. మరలా కొంత నిర్మానుష్యప్రదేశంలో ఆమెకి కాళ్లపీకు తిరుగ సంప్రాప్తించింది. మెల్లగా ఇంటికి చేరుకున్నారు.

గురువుగారు "ఏమోయ్ ఇంత ఆలస్యమైంది" అని అడిగారు శిష్యుణ్ణి. "ఏమీలేదండి. ఆమెకి తోవలో మూడుసార్లు కాళ్ళపీకు వచ్చింది. అప్పుడు మీరు సుబ్బమ్మగారికిచేసిన సేవ చెయ్యటంలో కొంత ఆలస్యమైంది" అన్నాడు శిష్యుడు. గురువుగారు నిలువుగా నీరయిపోయారు.

—జి. వి. ఆర్. కృష్ణరావు.

* * *

## హోలీ ప్రభావం

ఆవేళ హోలీ పండుగ. నాకు గుర్తు లేకుండా ఊలెన్ ఫేంటు న్యూహరాక్ షర్టు తొడుగుకొని నీటుగా తయారై సైకిలు పట్టుకొని బయలుదేరేను. మెయిన్‌రోడ్డు ఎక్కేను. రంగులు జల్లుకున్నవాళ్లు నాకు ఎదురయ్యేరు. వెంటనే నా గుండె ఆగినంతపని అయింది. మా ఫ్రండు "దౌలత్‌రాం" లోగడ ఒకసారి మాటపై మాటవచ్చి వచ్చే మా హోలీ పండుగకు నీవంటినిండా రంగు పూయకపోతే ఒట్టు? అని భీష్మించేడు. మా ఫ్రండు ఇల్లుకూడా అటువైపే వుండుటచేతను నాకు మా నాన్నగారు అప్పచెప్పిన పనికూడా అటే వుండుటచేతను మనస్సు పీకుతున్నా లేని ధైర్యం తెచ్చుకొని భగవంతునిపై భారంవేసి పోతున్నా. నా వెనుకే ఒక తాలూకా ఆఫీసులో పనిచేయుచున్న గుమస్తా కూడా నీటుగా తయారై వస్తూ యున్నాడు. ఇంతలో మా ఫ్రండు ఇల్లు దగ్గరకు వచ్చింది. నేను వస్తానని తెలుసుకుని రంగుతో నింపిన "పిచ్చికర్ర" పట్టుకొని నిలువబడ్డాడు నన్నుచూచి ఆపిచ్చికర్రతో రంగు జల్లబోయేడు, ఇంతలో నేను గ్రహించి సైకిలు ఒక ఫెడలు గట్టిగా నొక్కేసు. నా వెనుకనే వస్తున్న తాలూకా ఆఫీసు గుమాస్తాగారిమీద రంగంతా పడింది. ఇక చూడండి ఆ గుమస్తాగారు ప్రళయతాండవం చెంది మా ఫ్రండుపై కలబడిపోయేడు. ఇదియేది గమనించకుండా నా మట్టుకు నేను వెళ్లిపోయేను. ఆ మరుచటిరోజు స్కూలుకి వచ్చేటప్పుడు మా ఫ్రండు నాతో చెప్పినాడు క్లాసంతా మేష్టరుతో సహా నవ్వేము.

—ప్రతాప్, ★